సాక్షి
కుమురం భీం

శనివారం ; 8 ; ఏప్రిల్ ; 2023



ప్రభుత్వ బడులకు ట్యాబ్‌లు

పాఠశాలలకు ట్యాబ్‌లు అందించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. చైల్డ్ ఇన్ఫో, యూడైస్ తదితర వివరాలను ట్యాబ్‌లతో ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయనున్నారు. 10లో▸



వైద్యులు లేని ఆసుపత్రి

సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో వైద్యుల కొరత వేధిస్తోంది. రూ.కోట్ల నిధులతో వసతులు కల్పించినా పేదలకు మెరుగైన వైద్యం అందడం లేదు. 11లో▸

గరిష్టం/కనిష్టం
35.3 /24.2

వాతావరణం

ఆకాశంలో కొంతమేర మేఘాలు ఉంటాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. గాలిలో తేమశాతం పెరుగుతుంది. సాయంత్రం అక్కడక్కడా వడగండ్లు కురిసే అవకాశం ఉంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శని : 6:29	ఆది : 4:47

ఫీల్డ్ పరేషాన్!



ఉపాధిహామీ పనులను పర్యవేక్షిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్

పరిపాలన సౌలభ్యం కోసం కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించలేదు. పాత జీపీల్లో ఉన్న క్షేత్ర సహాయకులకే అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఉపాధిహామీ పథకం అమలు కష్టంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో కూలీల ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉండటం, ఒకే రోజుల రెండు, మూడు గ్రామాలు తిరగడంతో అవస్థలు పడుతున్నామని తెలిపారు.

- ఫీల్డ్ అసిస్టెంట్లకు రెండు, మూడు పంచాయతీల బాధ్యతలు
- నూతన నియామకాలు లేక పెరిగిన ఒత్తిడి
- కొన్నిచోట్ల పంచాయతీ కార్యదర్శులకు ఉపాధిహామీ బాధ్యతలు
- ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్

కెరమెరి(ఆసిఫాబాద్): నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా ఉపాధిహామీ పనులు ఊపందుకున్నాయి. అయితే ఫీల్డ్ అసిస్టెంట్ల కొరత కారణంగా పాత పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందిపై పనిభారం పడుతోంది. కొన్నిచోట్ల పంచాయతీ కార్యదర్శులే ఈ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో ఈజీఎస్ పనులపై పర్యవేక్షణ గాడి తప్పి పారదర్శకత లోపిస్తోంది. కూలీల సంఖ్య పెరగకపోవడం, సమయానికి పనులు నిర్వర్తించడం లేదు. అలాగే సకాలంలో కూలి డబ్బులు జమ కావడం లేదని కూలీలు ఆరోపిస్తున్నారు.

నూతన నియామకాలు బంద్..

కొత్త పంచాయతీల్లో ఐదేళ్ల దాటినా ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాలు చేపట్టలేదు. గతంలో వివిధ కారణాలతో ఎఫ్ఏలను ప్రభుత్వం విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో పంచాయతీ కార్యదర్శులే విధులు నిర్వర్తించారు. ఆ తర్వాత కొన్ని షరతులతో ఎఫ్ఏలను విధుల్లోకి తీసుకున్నా.. అవసరానికి సరిపడా సిబ్బంది సంఖ్యను పెంచలేదు. 2019లో మేజర్ గ్రామ పంచాయతీలను విడదీసి 500లకు పైగా జనాభా ఉన్న తండాలు, గూడేలను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. పంచాయతీలను యూనిట్‌గా తీసుకుని కూలీలకు ఉపాధిహామీ పనులు కల్పిస్తున్నారు. గతంలో ఉన్నవారే కొత్త పంచాయతీల బాధ్యతలను పర్యవేక్షించాల్సి వస్తోంది. జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ లెక్కన 335 క్షేత్ర సహాకులు విధుల్లో ఉండాల్సి ఉండగా, కేవలం 171 మంది మాత్రమే పనిచేస్తున్నారు. కొన్ని మండలాల్లో సరిపడా సిబ్బంది లేక రెండు, మూడు పంచాయతీల బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఐదేళ్ల నుంచి పాత పంచాయతీల్లోని ఎఫ్ఏలు, పంచాయతీ కార్యదర్శులే పనులను పర్యవేక్షిస్తున్నారు.

కొత్త సాఫ్ట్‌వేర్‌తో తిప్పలు..

కేంద్ర ప్రభుత్వం ఈజీఎస్ పనుల్లో పారదర్శకత కోసం తీసుకువచ్చిన ఎంఎంఎస్ సాఫ్ట్‌వేర్‌తో ఫీల్డ్ అసిస్టెంట్లపై పనిభారం పెరుగుతోంది. గ్రామాల్లో కూలీలకు పనుల కేటాయింపు, మస్టర్ల నమోదు, నూతన పనుల గుర్తింపు, జాబ్ కార్డులకు అర్హుల గుర్తించడంలో వీరే కీలకం. కూలీల ఫొటోలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం, పనుల పర్యవేక్షణ రోజువారీగా చేయాల్సి ఉంటుంది. గతంలో వివిధ కారణాలతో పలువురు ఎఫ్ఏలను విధుల నుంచి తొలగించారు. కొన్నిచోట్ల పంచాయతీ కార్యదర్శులకు బాధ్యతలు అప్పగించినా వారు పూర్తిస్థాయిలో దృష్టి సారించడం లేదు. దీంతో ఏటా లక్ష్యం మేరకు పనిదినాలు చేరుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నూతన నియామకాలు చేపట్టాలని ఫీల్డ్ అసిస్టెంట్లు కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది



రెండు, మూడు గ్రామాల్లో విధులు నిర్వర్తించడం ఇబ్బందిగా ఉంది. పనులపై పర్యవేక్షణ ఉండటం లేదు. ప్రభుత్వం స్పందించి ప్రతీ గ్రామ పంచాయతీకి ఒకరు చొప్పున క్షేత్ర సహాయకులను నియమించాలి. వేసవిలో పనిప్రదేశాలకు తిరగడం కష్టంగా ఉంటుంది. సరిపడా సిబ్బంది ఉంటే పనిభారం తగ్గుతుంది. – బోయారే రమేశ్, ఎఫ్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు

పంచాయతీల్లో కాసుల గలగల



పెంచికల్‌పేట్‌లో పన్నులు వసూలు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి (ఫైల్)

- జిల్లాలో 94 శాతం పన్నులు వసూలు
- మూడు మండలాల్లో వందశాతం
- సత్ఫలితాన్నిచ్చిన ప్రత్యేక డ్రైవ్
- జిల్లాలో 335 గ్రామ పంచాయతీలు

పెంచికల్‌పేట్(సిర్పూర్): జిల్లాలో గతంలో ఎన్నడూ లేనివిధంగా పన్నుల వసూలులో పంచాయతీలు మెరుగైన స్థితిలో నిలిచాయి. ఉన్నాధికారుల పర్యవేక్షణలో ప్రత్యేక కార్యాచరణ అమలు చేయడంతో 2022– 23 ఆర్థిక సంవత్సరంలో 94శాతం లక్ష్యాన్ని సాధించారు. జిల్లాలోని 15 మండలాల్లో మూడు మండలాలు వందశాతం పన్నులు వసూలు చేయడం విశేషం.

రెండేళ్లుగా ప్రత్యేక డ్రైవ్..

పంచాయతీల అభివృద్ధిలో పన్నుల ద్వారా వచ్చే ఆదాయమే కీలకం. అయితే కుమురంభీం జిల్లాలో ఆదివాసీ గ్రామాలు అధికంగా ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, గ్రామీణులకు అవగాహన లేకపోవడంతో గతంలో పన్నుల వసూలు లక్ష్యాన్ని చేరుకోలేదు. దీంతో జిల్లా అధికార యంత్రాంగం పన్నుల వసూలుపై ప్రత్యేక దృష్టి సారించింది. గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి మొండి బకాయిలను కూడా వసూలు చేసేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 15 మండలాల పరిధిలో 335 పంచాయతీలు, కాగజ్‌నగర్ మున్సిపాలిటీ ఉంది. గ్రామ పంచాయతీల పన్నుల వసూలు లక్ష్యం రూ.4,73,58,200 ఉండగా రూ.4,44,06,402 వసూలు చేశారు. మరో రూ.29,51,797 వసూలు చేయాల్సి ఉంది. ఇందులో మూడు కొత్త మండలాలైన లింగాపూర్, పెంచికల్‌పేట్, చింతలమానెపల్లి వందశాతం లక్ష్యాన్ని చేరుకుని ఆదర్శంగా నిలిచాయి.

పంచాయతీలకు పైసలు..

వివిధ రకాల పన్నుల రూపంలో పంచాయతీల ఖజానా కళకళలాడుతోంది. పంచాయతీల్లో కొన్నేళ్లుగా పేరుకుపోయిన మొండి బకాయిలను సైతం సిబ్బంది వసూలు చేయడంతో పంచాయతీలకు నిధులు సమకూరాయి. పన్నుల చెల్లింపుల విషయంలో గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయడంతో పన్నుల వసూలు సులభమైంది. కొన్ని నెలలుగా పంచాయతీల్లో పైసలు లేక ఇబ్బందులు పడగా నేడు కొంతవరకు సమస్య తీరింది.

జిల్లాలో పన్నుల వసూలు (రూ.లలో)

మండలం	లక్ష్యం	వసూలు	శాతం
ఆసిఫాబాద్	1,16,70,648	98,59,756	84
బెజ్జూర్	18,14,733	18,12,343	99
చింతలమానెపల్లి	17,49,843	17,49,843	100
దహెగాం	18,24,518	17,87,509	98
జైనూర్	29,38,613	26,42,837	90
కాగజ్‌నగర్	53,08,775	51,74,718	97
కెరమెరి	20,89,066	19,24,618	92
కౌటాల	40,15,834	39,04,834	97
లింగాపూర్	4,69,865	4,69,865	100
పెంచికల్‌పేట్	10,34,501	10,34,501	100
రెబ్బెన	30,78,305	30,18,094	98
సిర్పూర్(టి)	27,77,052	24,09,636	97
సిర్పూర్(యూ)	7,62,772	7,61,440	99
తిర్యాణి	23,68,888	22,34,065	94
వాంకిడి	57,54,786	56,22,313	98

ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం

జిల్లాలో పన్నులు వసూలుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం. రెండు నెలల నుంచి పన్నులు వసూలు చేయడానికి సిబ్బందితో ప్రత్యేకంగా సమీక్షించి దిశా నిర్దేశం చేశాం. జిల్లాలో ఇప్పటికి 94 శాతం మేర పన్నులు వసూలైంది. గతంలో ఉన్న మొండి బకా యిలను సైతం వసూలయ్యాయి. – రమేశ్, జిల్లా పంచాయతీ అధికారి

న్యూస్‌రీల్

ప్రజలు ఉద్యమానికి సిద్ధం కావాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

వాంకిడి(ఆసిఫాబాద్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి వ్యతిరేకంగా ప్రజలంతా ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆత్మకూరి చిరంజీవి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం సీపీఐ ఇంటింటికీ పాదయాత్ర పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నియంత పాలన సాగిస్తున్న ప్రధాని మోదీని గద్దె దింపేందుకు పోరాడుదామన్నారు. బీజేపీ హఠావో దేశ్ బచావో నినాదంతో ఈ నెల 14 నుంచి మే 14 వరకు సీపీఐ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసరాల ధరలు అమాంతం పెంచుతూ సామాన్యుడి నడ్డి విరుస్తోందని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న సీపీఐ పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బోయిరె ప్రకాశ్, నాయకులు మహేశ్, బావునె వికాస్, శైలేశ్, ఆనందరావు, బాపు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్ఎఫ్ సంజీవని



చెక్కులు అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

ఆసిఫాబాద్‌అర్బన్: అనారోగ్యం బారిన పడే పేదలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సీఎంఆర్ఎఫ్ సంజీవనిలా పని చేస్తుందని జెడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు ఆపత్కాలంలో సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారిందన్నారు. ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తుందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు కోట్ల రూపాయలను సీఎం నిధి కింద అందించినట్లు వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

నిరుద్యోగులకు అండగా వైఎస్సార్‌టీపీ



నిరసన తెలుపుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో బీఆర్ఎస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని, విద్యార్థులు, నిరుద్యోగులకు వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల అండగా నిలుస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు గోవింద్‌నాయక్ స్పష్టం చేశారు. ప్రభుత్వం అసమర్థ పాలనను నిరసిస్తూ జైనూర్ మండల కేంద్రంలో శుక్రవారం కాగడాలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరుద్యోగుల కోసం షర్మిల ఉద్యమం చేపడుతుందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో లీకులు, లిక్కర్ వ్యవహారం రాజ్యమేలుతుందని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ జైనూర్ మండల అధ్యక్షుడు వైద్‌ఖాన్, సిర్పూర్(యూ) మండల అధ్యక్షుడు శంకర్ ఆడె, జిల్లా కార్యదర్శి షకీర్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్వరలో ఫైరింగ్ రేంజ్ ప్రారంభం

- ఎస్పీ సురేశ్‌కుమార్



ఇందానిలోని ఫైరింగ్ రేంజ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్, తదితరులు

వాంకిడి(ఆసిఫాబాద్): వాంకిడి మండలం ఇందాని గ్రామ శివారులో ఏర్పాటు చేసిన పోలీస్ ఫైరింగ్ రేంజ్‌ను త్వరలో ప్రారంభిస్తామని ఎస్పీ కె.సురేశ్ కుమార్ తెలిపారు. పనులు తుది దశకు చేరుకోగా శుక్రవారం ఫైరింగ్ రేంజ్ స్థలాన్ని ఏఎస్పీ అచ్చేశ్వర్ రావు, డీఎస్పీ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గతంలో కుమురం భీం జిల్లా పోలీసులు బెల్లంపల్లిలోని ఫైరింగ్ రేంజ్‌కి వెళ్లాల్సి వచ్చేదన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని గతేడాది ఇందాని గ్రామ శివారులో ఫైరింగ్ రేంజ్ ఏర్పాటుకు నిర్ణయించామని పేర్కొన్నారు. ప్రస్తుతం పనులు తుదిదశకు చేరుకున్నాయని తెలిపారు. వాంకిడి సీఐ శ్రీనివాస్, ఎస్సై డి.సాగర్, సిబ్బంది ఉన్నారు.

యేసు క్రీస్తు ప్రేమామయుడు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బిషప్ ప్రిన్స్ అంథోని
- ఘనంగా గుడ్‌ఫ్రైడే

కౌటాల(సిర్పూర్): యేసు క్రీస్తు ప్రేమామయుడని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బిషప్ ప్రిన్స్ అంథోని అన్నారు. కౌటాలలో శుక్రవారం నిర్వహించిన గుడ్ ఫ్రైడే వేడుకల్లో ఆయన క్రైస్తవులకు దేవుని వాక్యం బోధించారు. ప్రజల పాపాలను క్షమించడానికి, ప్రజలను రక్షించాడనికి యేసు శిలువ వేయబడ్డారని తెలిపారు. ఇతరులతో ప్రేమతో మెలగాలని సూచించారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా యాపలగూడ చర్చిలో ఫాదర్ సెతీష్, కౌటాలలో ఫాదర్ టామ్, విజయనగరం చర్చిలో ఫాదర్ సీజో, శివలింగపూర్ చర్చిలో పాస్టర్ సువార్త రాజన్న, సదాశివపేట చర్చిలో పాస్టర్ శ్రీనివాస్ దైవుడి వాక్యం బోధించారు. అనంతరం ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కల్వరి గిరిపై ప్రత్యేక ప్రార్థనలు..

గుడ్ ఫ్రైడే పండుగను పురస్కరించుకుని కౌటాల, యాపలగూడ, చింతలమానెపల్లి మండలం బాలజీ అనుకోడ, సిర్పూర్(టి) గ్రామాల నుంచి కౌటాల మండ కేంద్రానికి క్రైస్తవులు పాదయాత్రగా తరలివచ్చారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి భక్తులు శిలువను మోస్తూ శాంతి ర్యాలీగా కల్వరి గిరిపైకి చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

మూడోసారి అధికారం చేపట్టేలా కృషి చేయాలి



మాట్లాడుతున్న నారదాసు లక్ష్మణరావు



బీఆర్ఎస్ శ్రేణుల బైక్ ర్యాలీ

- మాజీ ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణరావు
- రెబ్బెన మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

రెబ్బెన(ఆసిఫాబాద్): బీఆర్ఎస్ ప్రభుత్వం మూడోసారి రాష్ట్రంలో అధికారం చేపట్టేలా పార్టీలోని ప్రతీ కార్యకర్త కృషి చేయాలని మాజీ ఎమ్మెల్సీ, జిల్లా ఇన్ చార్జి నారదాసు లక్ష్మణరావు అన్నారు. రెబ్బెన మండల కేంద్రంలోని కేకే గార్డెన్స్‌లో శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ దండె విఠల్, పార్టీ జిల్లా అధ్యక్షుడు, సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్ చార్జి మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాకపోయి ఉంటే ఇప్పుడున్న అభివృద్ధి జరిగేది కాదన్నారు. సీఎం కేసీఆర్‌కు ఉన్న విజన్, ముందుచూపు ఏ రాజకీయ నాయకుడికి లేదని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రత్యేక కృషితోనే పది జిల్లాలుగా ఉన్న తెలంగాణలో నేడు 33 జిల్లాలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంగా ఏర్పాటవుతుందని ఎవరూ ఊహించి ఉండరన్నారు. కేసీఆర్ లేకపోతే ఆసిఫాబాద్ జిల్లాగా మారి ఉండేదికాదని, మెడికల్ కాలేజీ సైతం మంజూరయ్యేది కాదని పేర్కొన్నారు. తెలంగాణకు బీజేపీ చేసిందేమీ లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడమే తప్పా ప్రజలకు ఇది చేస్తామని చెప్పిన దాఖలాలు బీజేపీకి లేవని విమర్శించారు. మరో 8 నెలలో ఎన్నికలు రానున్నాయని కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఇంటింటికీ సంక్షేమ ఫలాలు..

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇంటింటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలు అందతున్నాయన్నారు. రెబ్బెన మండలంలోనే ప్రభుత్వ పథకాల పేరుతో రూ.కోట్ల నిధులు ప్రభుత్వం కేటాయిస్తోందన్నారు. నాలుగు నెలల క్రితం ఎమ్మెల్యే కొనుగోలుకు యత్నాలు, పేపర్ లీకేజీలతో నిరుద్యోగ యువతకు అన్యాయం చేయడంతో పాటు పదో తరగతి ప్రశ్నపత్రాన్ని సైతం లీకు చేసి విద్యార్థుల తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేసిన ఘనత బీజేపీదని విమర్శించారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడే ప్రభుత్వం కావాలో రాష్ట్రాభివృద్ధికి పాటుపడే బీఆర్ఎస్ కావాలో ప్రజలు తేల్చుకోవాలన్నారు. రెబ్బెన మండలంలోని పైకాజీగూడకు రోడ్డు వేశాకే ఓట్లు అడిగేందుకు గ్రామానికి వస్తామని తెలిపారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. సమావేశానికి ముందు గంగాపూర్ కమాన్ నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పెద్దఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ గాదేవేణి మల్లేశ్, జెడ్పీటీసీ సంతోష్, ఎంపీపీ సౌందర్య, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీలు బాబురావు, చంద్రయ్య, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వనజ, సర్పంచులు సంఘం మండల అధ్యక్షుడు సోమశేఖర్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ మహేశ్‌గౌడ్, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

కోనప్ప సేవలు అభినందనీయం



భోజనం వడ్డిస్తున్న మార్కారస్, కోనేరు రమాదేవి

కాగజ్‌నగర్‌టౌన్: నిత్యాన్నదానం గొప్ప సంకల్పమని, సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సేవలు అభినందనీయమని నెదర్లాండ్‌కు చెందిన మహిళా పర్యాటకురాలు మార్కారస్ అన్నారు. భారత పర్యటనలో ఉన్న ఆమె సిర్పూర్ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిత్యాన్నదాన సత్రాన్ని సందర్శించేందుకు శుక్రవారం మధ్యాహ్నం కాగజ్‌నగర్‌కు చేరుకున్నారు. బస్టాండ్ ఎదురుగా కొనసాగుతున్న నిత్యాన్నదాన కేంద్రాన్ని పరిశీలించారు. స్టోర్ రూం, వంటశాలలు, డైనింగ్ హాల్, ఇతర ఏర్పాట్ల గురించి ఎమ్మెల్యే కోనప్ప సతీమణి రమాదేవిని అడిగి తెలుసుకున్నారు.

ఈస్‌గాంలో ప్రత్యేక పూజలు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని ఈస్‌గాం శివమల్లన్న దేవాలయంలో శుక్రవారం నెదర్లాండ్‌కు చెందిన మర్కారస్ శివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇందారపు రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. కార్యక్రమంలో అర్చకులు సంతోష్ శర్మ, ధర్మకర్తల మండలి సభ్యురాలు మామిడాల మమత, మంజుల, అరుణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చేపల వలకు చిక్కిన మొసలిపిల్ల!



వలలో చిక్కిన మొసలి పిల్ల ఇదే..

దండేపల్లి: మండలంలోని పెద్దపేట చెరువులో శుక్రవారం జాలర్లు చేపలు పడుతుండగా వలలో ఓ మొసలిపిల్ల చిక్కింది. దానిని చూసి కంగుతిన్న జాలర్లు విషయాన్ని తాళ్లపేట అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఎఫ్ఆర్‌వో రత్నాకర్‌రావు తమ సిబ్బందితో చెరువు వద్దకు చేరుకుని మొసలిపిల్లను తమ వాహనంలో గూడెం గోదావరి తీరానికి తీసుకెళ్లి నదిలో వదిలిపెట్టారు.

అటవీశాఖ అధికారుల దాడులు

- 50 వేల విలువ గల కలప పట్టివేత



పట్టుకున్న కలపతో అటవి అధికారులు

జన్నారం: న్నారం అటవి డివిజన్ పరిధిలోని ఇందన్‌పెల్లి అటవీ రేంజ్ మొర్రిగూడ, కామన్‌పెల్లి, దేవునిగూడెం, కవ్వాల్, హాస్టల్ తండా, నాయికపుగూడ, కొత్తూర్‌పల్లి గ్రామాల్లో శుక్రవారం అటవీశాఖ అధికారులు దాడులు నిర్వహించి ఇంటింటా తనిఖీలు చేపట్టారు. కవ్వాల్ గ్రామంలో 23 టేకు చెక్కలు, 02 టేకు దుంగలు స్వాధీనం చేసుకున్నామని రేంజ్ అధికారి హఫీజోద్దీన్ తెలిపారు. పట్టుకున్న కలప విలువ రూ. 50 వేలు ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జన్నారం, ఇందన్‌పల్లి రేంజ్ సిబ్బంది కిరణ్మయి, అఫ్జల్, ఆనంద్, సహీరా పర్వీన్, శేషారావ్, శివకుమార్, రవి పాల్గొన్నారు.

లారీ అదుపుతప్పి బోల్తా



రసూల్‌పల్లి వంతెన వద్ద బోల్తాపడిన లారీ

జైపూర్: మండలంలోని రసూల్‌పల్లి సమీపంలోని పెద్దవాగు వంతెన వద్ద పత్తి లారీ అదుపు తప్పి బోల్తాపడింది. చెన్నూర్ నుంచి పత్తి లోడుతో మంచిర్యాల వైపు వెళ్తున్న లారీ రసూల్‌పల్లి పెద్దవాగు లో లెవల్ వంతెన వద్ద బోల్తాపడింది. లారీ బోల్తాపడినప్పటికీ డ్రైవర్, క్లీనర్ క్షేమంగా బయటపడ్డారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

తలమడుగు: యువకుడు రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని కోడథ్ గ్రామానికి చెందిన కొల్లూరి తేజ (22) ఏ పనిచేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. దీంతో తల్లిదండ్రులు మందలించారు. మనస్తాపానికి గురై గురువారం రాత్రి గ్రామ సమీపంలోని కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడరు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ బడులకు ట్యాబ్‌లు

- త్వరలో పంపిణీ చేయనున్నట్లు అధికారులు
- ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ
- మౌలిక వసతుల మెరుగుకు చర్యలు

జిల్లాల వారీగా ట్యాబ్‌ల పంపిణీ

ఆదిలాబాద్	565
మంచిర్యాల	533
కుమురంభీం	586
నిర్మల్	553



ఆదిలాబాద్ జిల్లాకు చేరిన ట్యాబ్‌లు

నిర్మల్‌రూరల్: పాఠశాల విద్యను మరింత బలోపేతం చేయడంతో పాటు ఆధునిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కరోనా తదితర కారణాలతో ప్రాథమిక పాఠశాల్లోని విద్యార్థులకు కనీస సామర్థ్యాలు సాధించలేకపోయారని గుర్తించి ప్రభుత్వం ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం కింద ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. సర్కారు బడుల్లో కార్పొరేట్‌కు దీటుగా విద్యను అందించేందుకు కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. ఇందులో భాగంగానే ప్రభుత్వ పాఠశాలలకు ట్యాబ్‌లు అందించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. నిర్మల్ జిల్లా ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల 618 ఉండగా ఇప్పటికే 553 ట్యాబ్‌లు జిల్లాకు చేరుకున్నాయి. త్వరలో ఎంపిక చేసిన బడులకు వీటిని అందిందించనున్నారు. తొలివిడతలో రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన 19,800 పాఠశాలలకు అందజేయనున్నారు.

జిల్లాకు చేరిన 553 ట్యాబ్‌లు..

ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 553 ట్యాబ్‌లను కేటాయించింది. జిల్లాలో ఇప్పటికే మన ఊరు– మనబడి, మన బస్తి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపడుతున్నాయి. 2023– 24 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు సరికొత్త యూనిఫామ్ కోసం ప్రభుత్వం ఇప్పటికే వస్త్రాన్ని అందజేసింది. ప్రస్తుతం బడుల సమగ్ర సమాచారాన్ని ప్రతిరోజు ఉపాధ్యాయులు సెల్ ఫోన్‌తో ।యుడైస్ ప్లస్‌₹ లో నిక్షిప్తం చేస్తున్నారు. ఈ క్రమంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఉపాధ్యాయులు రిక్వెస్ట్ చేయడంతో ట్యాబ్‌లను సరఫరా చేసిందని జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

మంచిర్యాల జిల్లాలో...

మంచిర్యాల జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 433, ప్రాథమికోన్నత 95 ఉన్నాయి. మొత్తం 528 పాఠశాలలకు 533 ట్యాబ్‌లు జిల్లాకు చేరాయి.

ఆసిఫాబాద్ జిల్లాలో..

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 535, ప్రాథమికొన్నత పాఠశాలలు 98 ఉండగా 571 పాఠశాలలు మాత్రమే 586 ట్యాబ్‌లు పంపిణీ చేయనున్నారు.

ఏం చేస్తారు...

జిల్లాలో కొన్ని ప్రాథమిక, ప్రాథమిక, ఉన్నత పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి వివరాలు, అదేవిధంగా విద్యార్థికి ఆయా పరీక్షల్లో వచ్చిన మార్కులు, పాఠ్యాంశ ప్రణాళిక అమలులో విద్యార్థి ప్రతిభ, విద్యార్థి అడ్మిషన్ సంఖ్య, మధ్యాహ్న భోజనం, అభ్యసన సామర్థ్యం, మన ఊరు– మన బడి, మన బస్తీ, పాఠశాల వదిలి వెళ్లిన తేదీ తదితర విషయాలన్నీ ఇందులో నిక్షిప్తం చేయనున్నారు. జిల్లాలో మొత్తం 735 ప్రభుత్వ జిల్లాలో 150 కంటే ఎక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలకు రెండేసి ట్యాబ్‌లను అందజేస్తారు.

ఆదిలాబాద్ జిల్లాకు..

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని పభుత్వ ప్రాథమిక, ప్రాథమికొన్నత పాఠశాలలకు సంబంధించిన సమస్త సమాచారాన్ని నిక్షిప్తం చేసేందుకు వీలుగా ప్రభుత్వం ట్యాబ్‌లను మంజూరు చేసింది. ఈ మేరకు శుక్రవారం సామ్‌సాంగ్ కంపెనీకి చెందిన 565ట్యాబ్‌లు జిల్లాకు చేరారు. జిల్లాలో 436 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలుండగా 450 ట్యాబ్‌లు, 105 ప్రాథమికొన్నత పాఠశాలలకు 115 ట్యాబ్‌లను మంజూరు చేశారు. పది నుంచి 165 మంది విద్యార్థులకు ఒక ట్యాబ్‌ను అందించనుండగా అంతకు మించి విద్యార్థుల సంఖ్య కలిగిన పాఠశాలలకు రెండు చొప్పున ట్యాబ్‌లు అందించనున్నారు. మొత్తం 541 పాఠశాలకు 565 ట్యాబ్‌లను పంపించారు. ప్రాథమిక, ప్రాథమికొన్నత పాఠశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, మధ్యాహ్న భోజన వివరాలు, పాఠశాలలకు సంబంధించిన సమస్త సమాచారాన్ని ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయనున్నారు. ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి ట్యాబ్‌లను అందజేస్తామని డీఈఓ టి.ప్రణీత తెలిపారు.

త్వరలో అందజేస్తాం



జిల్లాకు 553 ట్యాబ్‌లు వచ్చాయి. వీటిని డీఈవో కార్యాలయంలో భద్రపరిచాం. త్వరలోనే ఉపాధ్యాయులకు అందజేస్తాం. పాఠశాలకు సంబంధించిన రిపోర్టులు సెల్‌ఫోన్‌లో పంపించే క్రమంలో ఉపాధ్యాయులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలు ఉత్పన్నం కాకుండా ప్రభుత్వం వీటిని సరఫరా చేస్తోంది.
– రవీందర్‌రెడ్డి, డీఈవో, నిర్మల్

ఆర్టీసీ బస్సును ఢీకొట్టిన లారీ



లారీ ఢీకొన్న బస్సు

ఆసిఫాబాద్‌రూరల్: ఆర్టీసీ డిపో బస్సును లారీ ఢీకొన్న సంఘటన జిల్లా కేంద్ర సమీపంలోని ఆదిలాబాద్ ఎక్స్‌రోడ్ వద్ద చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రపూర్ నుంచి ఆసిఫాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సు ఆదిలాబాద్ ఎక్స్ రోడ్డు దాటి ఆసిఫాబాద్ ప్రవేశించే క్రమంలో బైపాస్ వద్ద ఎదురుగా వస్తున్న లారీ వెనుక భాగంలో ఢీ కొట్టింది. బస్సులో మొత్తం 85 మంది ప్రయాణికులు ఉండగా వాహనాల వేగం అదుపులో ఉండడంతో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఇదే విషయం డిపో మేనేజర్ శ్రీధర్‌ను అడగగా బస్సులో ముగ్గురికి చిన్నగా గాయాలైనట్లు మహారాష్ట్ర దేవాడకు చెందిన సురేష్‌కు కొంచెం ఎక్కువగా గాయాలు కావడంతో అసుపత్రికి తరలించినట్లు తెలిపారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

తవ్వకాల్లో బయటపడ్డ సీతారాముల విగ్రహాలు



విగ్రహాలకు గ్రామస్తుల పూజలు..

జన్నారం: మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తపాలపూర్ అటవీ ప్రాంతంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పథకం కందకాల పనుల్లో శుక్రవారం సీతారాముల విగ్రహాలు బయటపడ్డాయి. కూలీలు కందకాలు తీస్తుండగా పంచలోహ విగ్రహాలు కనిపించడంతో బయటకు తీశారు. గ్రామస్తులు చేరుకుని పూజలు నిర్వహించారు. ఏఎస్సై రత్నం, ఆర్ఐ భానుచందర్ అక్కడికి చేరుకుని విగ్రహాలను పరిశీలించారు. వాటిని దేవాదాయ శాఖకు అప్పగిస్తామని చెప్పగా గ్రామస్తులు అంగీకరించలేదు. ఇక్కడే నెలకొల్పి పూజలు చేస్తామని స్పష్టం చేశారు. దీంతో విగ్రహాలను సర్పంచ్ తిరుపతి, ఉపసర్పంచ్ రాజేశ్వర్, గ్రామ పెద్దల సమక్షంలో గ్రామంలోని సచివాలయంలో భద్రపర్చారు.

షావెల్ బోల్తాపడి ఆపరేటర్‌కు గాయాలు



ఆపరేటర్‌ను పరామర్శిస్తున్న సత్యనారాయణ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–ఓసీలో శుక్రవారం రెండో షిఫ్టులోని విధి నిర్వహణలో షావల్ అదుపు తప్పి బోల్తా పడడంతో సంజీవ్‌కుమార్ అనే ఆపరేటర్‌కు గాయాలయ్యాయి. వెంటనే అతడిని కళ్యాణిఖని ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి రామకృష్ణాపూర్ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో సంజీవ్‌ను ఏఐటీయూసీ మందమర్రి ఏరియా బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు శ్రీనివాస్ పరామర్శించారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

పాతమంచిర్యాల: ఈ నెల 9న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సాంబమూర్తి కార్యదర్శి మారయ్య శుక్రవారం తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే బాలబాలికలు 20 ఏళ్లలోపు ఉండాలని తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపినవారికి ఈ నెల 15, 16 తేదీల్లో హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వివరించారు. ఆసక్తి గల క్రీడాకారులు 9వ తేదీన ఉదయం 6గంటలకు సీతారాంపల్లి సెకండరీ పాఠశాలలో రిపోర్టు చేయాలన్నారు. వివరాలకు ఈ 9849646224 నంబర్‌లో సంప్రదించాలన్నారు.



పాఠశాలనే.. పైకప్పు కొట్టుకుపోయింది..

కాగజ్‌నగర్‌రూరల్: ఇదీ కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ మండలం మాలిని గ్రామ పంచాయతీ పరిధి మానిక్‌పటార్‌లోని ఏకోపాధ్యాయ పాఠశాల. ఇందులో 20మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి 24 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామంలో 36 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. శుక్రవారం మండలంలో ఈదురుగాలులతో కూడిన వర్షానికి తడకల పాఠశాల పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. అలాగే మానిక్‌పటార్, రేగులగూడ, ఊట్‌పల్లి, లైనుగూడ, ఎల్లాపూర్, జోగాపూర్, గోంది, నందిగూడ, శివాపూర్, బారెగూడ, మాలిని గ్రామాల్లో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. చెట్లు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. గన్నారం, మోసం, ఈజ్‌గాం గ్రామాల్లో మామిడితోటలకు నష్టం వాటిల్లింది.

మోదీకి నిరసన సెగ చూపాలి

- టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య

శ్రీరాంపూర్: రాష్ట్రానికి వస్తున్న మోదీకి సింగరేణి కార్మికవర్గం తమ నిరసన సెగ చూపాలని టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగర్ల మల్లయ్య తెలిపారు. శుక్రవారం ఆయన నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో యూనియన్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. సింగరేణిలో నాలుగు బొగ్గు బ్లాకులను ప్రైవేటుకు అప్పగిస్తూ వేలం వేసిన మోదీ నేడు రాష్ట్ర పర్యటనకు వస్తున్నందున ఆయనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ డివిజన్‌లోని కార్మికులంతా శనివారం ఉదయం 10:30 గంటలకు సీసీసీ కార్నర్‌లో జరిగే మహాధర్నాకు తరలిరావాలన్నారు. సింగరేణిని కుట్ర పూరితంగా ప్రైవేటు పరం చేయడానికి మోదీ సర్కార్ పన్నాగాలు పన్నుతోందన్నారు. ఇప్పటికే కోలిండియాలో 33 శాతం షేర్లను ప్రైవేటు సంస్థలకు విక్రయించారని మండిపడ్డారు. ప్రభుత్వ సంస్థల్లో డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ.65వేల కోట్లను సమకూర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కెంగర్ల మల్లయ్య

కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షులు అన్నయ్య, మంద మల్లారెడ్డి, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి, నాయకులు పెట్టం లక్ష్మణ్, వెంగళకుమారస్వామి, కాశీరావు, కానుగంటి చంద్రయ్య, చేరాలు, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయండి
–టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్

రామకృష్ణాపూర్: కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో శనివారం సీసీసీలో తలపెట్టిన మహాధర్నాను కార్మికులు విజయవంతం చేయాలని యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపెల్లి సంపత్ పిలుపునిచ్చారు. మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు బడికల సంపత్, రమణ, శంకర్రావు, మేకల రాజయ్య, ముద్దసాని కృష్ణ, సంఘం నాయకులు పాల్గొన్నారు.

వాహనం బోల్తాపడి ఒకరి మృతి

- మరో ఇద్దరికి గాయాలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని బాబాపూర్ గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం బొలేరో వాహనం బోల్తా పడి మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా ఆళ్లపల్లికి చెందిన అరుణ్ ఆనంద్‌రావు(23) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. కాగజ్‌నగర్ నుంచి మహారాష్ట్రలోని ఆళ్లపల్లికి బెల్లం లోడుతో వెళ్తుండగా బాబాపూర్ సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. బొలేరోలో అరుణ్ ఆనంద్‌రావుతోపాటు సహదేవ్ జగదేవ్, నగేశ్ సెడ్మెకె, గణేష్ సుఖ్‌దేవ్ ఆత్రం, సూరజ్ నాందేవ్ సిడాం ప్రయాణిస్తున్నారు. ఈ ప్రమాదంలో అరుణ్ ఆనంద్‌రావు అక్కడికక్కడే మృతిచెందగా, సహదేవ్ జగదేవ్, గణేష్ సుఖ్‌దేవ్‌లకు గాయాలయ్యాయి. వాహనాన్ని అతివేగంగా, అజాగ్రత్తగా నడిపి ప్రమాదానికి కారణమైన డ్రైవర్ ప్రణయ్ దిలీప్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

పట్టుబడిన వాహనాల వేలం

పాతమంచిర్యాల: ఎక్సైజ్ నేరాలలో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 10న ఉదయం 10.30 గంటలకు మంచిర్యాల ఎక్సైజ్ స్టేషన్‌లో వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ ఎస్సై నరేందర్ తెలిపారు. ఆసక్తి గలవారు సోమవారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరను 50శాతం ఈఎండీ రూపంలో చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు. వేలం వేసే వాహనాలను పరిశీలించుకోవచ్చని తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం



మహమ్మద్ ఫారూక్

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని జీడిచేను గ్రామానికి చెందిన మహమ్మద్ ఫారూక్ (67) అదృశ్యమైనట్లు కాగజ్‌నగర్ రూరల్ ఎస్సై సోనియా తెలిపారు. ఈనెల 28న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఫారూక్‌కు మతిస్థిమితం లేదని గతంలో కూడా ఇలాగే ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని పేర్కొన్నారు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆలయంలో చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలోని రేణుకామాతా ఆలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై విష్ణువర్ధన్ కథనం ప్రకారం.. రేణుకామాతా అమ్మవారిపై ఉన్న రూ.2లక్షల విలువ చేసే వెండీ ఆభరణాలు, హుండీలోని రూ.30వేల నగదును దుండగులు ఎత్తుకెళ్లారు.

సైకాలజిస్ట్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక

మంచిర్యాలఅర్బన్: స్థానిక క్రిష్ణవేణి టాలెంట్ హైస్కూల్‌లో శుక్రవారం తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మానసిక వైద్య నిపుణులు సునీల్‌కుమార్ మాట్లాడుతూ నేడు సైకాలజిస్టుల అవసరం ఎంతో ఉందన్నారు. విద్యార్థుల విధ్వంసకరమైన ఆలోచనలు, వింత పోకడలకు అదుపులో ఉంచడానికి సైకాలజీ ఎంతో తోడ్పడుతుందన్నారు. అనంతరం మంచిర్యాల జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా శశికిరణ్, జిల్లా ఉపాధ్యక్షులుగా సమ్మయ్య, సుమన చైతన్య, జాయింట్ సెక్రటరీలుగా కిరణ్‌కుమార్, మొగిలి, కోశాధికారిగా చంద్రమోహన్‌గౌడ్, గౌరవ సలహాదారుగా కస్తూరి పద్మచరణ్, యోగేశ్వర్, కార్యవర్గ సభ్యులు అఫ్జల్, శ్రీకాంత్, రవికుమార్, శీరిషలను ఎన్నుకున్నట్లు ఎన్నికల పర్యవేక్షకుడు నారాయణరావు తెలిపారు.

కూరగాయల మార్కెట్‌ను తరలిస్తే ఉద్యమమే

పాతమంచిర్యాల: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌ను వేరే చోటికి తరలించవద్దని మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావు అన్నారు. శుక్రవారం కూరగాయల మార్కెట్‌ను సందర్శించి వ్యాపారస్తులతో మాట్లాడారు. 50ఏళ్లుగా కూరగాయల అమ్మకాలపై జీవనోపాధి పొందుతున్న వ్యాపారులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. కూరగాయల మార్కెట్ సముదాయాన్ని వేరే చోటికి మారిస్తే వ్యాపారుల పక్షాన పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు.

సబ్‌స్టేషన్ పనులు పరిశీలించిన డైరెక్టర్



పరిశీలిస్తున్న డైరెక్టర్ మోహన్‌రెడ్డి

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శివాజీనగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న 33/11 సబ్‌స్టేషన్‌ను టీఎస్ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ మోహన్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. సబ్‌స్టేషన్ నిర్మాణంలో పెండింగ్‌లోని పనులను సైతం త్వరితగతిన పూర్తిచేసి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావాలని త్వరలోనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్ఈ శేషారావు, డీఈ ఖౌసర్, ఏడీఈ రాజశేఖర్, ఏఈ జయకృష్ణ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో న్యాయవిజ్ఞాన సదస్సు

నస్పూర్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవా సంస్థ, జిల్లా ఆరోగ్య సంస్థల ఆధ్వర్యంలో నస్పూర్ పీహెచ్‌సీలో న్యాయ విజ్ఞాన సదస్సును శుక్రవారం నిర్వహించారు.ఈ సదస్సుకు సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయ సేవా సంస్థల ద్వారా ప్రజలకు న్యాయ పరమైన సమస్యల పరిష్కారమే కాకుండా ప్రభుత్వం నుండి అందే పథకాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. అదే విధంగా ప్రభుత్వంలోని అన్ని శాఖల సమన్వయానికి సైతం కృషి చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సమత, సూపర్ వైజర్ దత్తు, ఆశా వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి వాణి పాల్గొన్నారు.



నస్పూర్ పీహెచ్‌సీ వద్ద మెడికల్ సిబ్బందితో జడ్జి ఉదయ్‌కుమార్